# లోక విద్య ప్రపంచం

మాసపత్రిక

లోకవిద్య సాధికార సంఘటన ఆం.ప్ర. సదస్సు ప్రత్యేక సంచిక

బులెటిన్ మే 2012 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## స్వదేశీ ఉత్పత్తుల్ని ప్రోత్సహించండి బహుళజాతి, విదేశీ సంస్థల ఉత్పత్తులను బహిష్కరించండి

దేశంలో ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అనుసరిస్తున్న విధానాలు వల్ల వివిధ వర్గాల ప్రజలు ఉపాధి కోల్పోతున్నారు. చిన్నతరహా పరిశ్రమలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పోటీకీ తట్టుకోలేక మూతపడ్తున్నాయి. లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. భారీ పరిశ్రమలు లాభాల్లో నడిచేవి, విదేశీ కంపెనీలకు అమ్మివేస్తూ తక్కువ మందితో అధిక ఉత్పత్తిచేసే సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి చేసుకోవడంతో వేలాదిమంది కార్మికులతో నడిచే పరిశ్రమలు కార్మికుల సంఖ్యలో కోత విధించి కొన్ని వందల తాత్కాలిక కార్మికులతో నడుపుతూ అధికోత్పత్తితో చవకగా మార్కెట్ చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో విత్తనాల నుండి రసాయనిక మందుల వరకు నాసిరకం సరఫరా చేస్తూ, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరను చెల్లించడం లేదు. పారిశ్రామిక వస్తు ధర నిర్ణయంలో ప్రాథమిక ఖర్చులు, పరిశోధనలు, అధికారుల ఇళ్ళు, ఫోన్లు, పిల్లల చదువు, ప్రతీదానికీ బీమాతో పాటు శలవు విహారఖర్చులు, మార్కెటింగు, ప్రకటన ఖర్చులు అన్నీ కల్పి అమ్మే ధర నిర్ణయం జరుగుతుంది. కాని వ్యవసాయ ఉత్పత్తుల ధరలలో కూలీల ఖర్చు. విత్తన ఖర్చు ఇతర పెట్టుబడులు మాత్రం కలిపి ధర నిర్ణయం జరుగుతుంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయానికి సబ్సిడీలు చౌక రుణాలు ఇవ్వటం జరుగుతోంది. కాని ఈనాడు వ్యవసాయానికి ఇవ్వవలసిన సబ్సీడీలను, బ్యాంకు రుణాలను ఇవ్వకుండా మార్కెట్లో దళారులు లాభపడే విధంగా, కష్టపడి పండించే రైతుకు ప్రతిఫలం లభించకుండా ఏ కష్టం లేకుండా దళారులు కొద్ది పెట్టుబడితో రైతుల కష్టాన్ని కాజేస్తున్నారు. దళారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, దళారుల నుండి కమీషన్లు పొందుతున్న పాలకులు వ్యవసాయం చేసే రైతులను ఆత్మహత్యలు చేసుకొనే స్థితి కల్పిస్తున్నారు.

ప్రజల తరుపున నిజాయితీగా పనిచేసే మేధావులు, ప్రజాసంఘాల కార్యకర్తలకు దళారీ పాలకులు నిర్బంధం ద్వారా, దాడుల ద్వారా, ఉగ్రవాదులనే ముద్రతో దాడులు చేస్తున్నారు. కాంగ్రెస్ వామపక్షాల నుండి బి.జె.పి. వరకు, దళితుల నుండి, బి.సి. మైనారిటీ వాదుల వరకు దళారీ పాలకుల విధానాలను తరతమ భేదాలతో పాటిస్తున్నారు.

ఈ నేపథ్యంలో దేశంలో 60 నుండి 70 శాతం ప్రజలు నివసించే గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా వుంది. దేశంలో వనరులలో పన్నుల రూపేణా ప్రజల గోళ్ళూడగొట్టి వసూలు చేస్తున్న నిధులలో అత్యధిక భాగం పట్టణప్రాంతాలలో, పారిశ్రామిక వర్గాలు, రాజకీయ నాయకులు లబ్ధికే ఉపయోగిస్తున్నారు. దేశం నుండి ఎన్నడూ లేనంతగా వనరులు, డబ్బు విదేశీ కంపెనీలకు తరలిపోతున్నాయి. దీన్ని తక్షణం నిరోధించాలి.

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వివిధ వృత్తులలో పనిచేసి ఆయా ఉత్పత్తులను గ్రామీణ సంతలలో విక్రయిస్తే ప్రజల మధ్య ఆయా ఉత్పత్తులకు పరస్పరం కొనుగోలు చేయడం ద్వారా మన డబ్బు, వనరులు ప్రజలమధ్యనే ఉంటుంది. ప్యాక్ చేసిన ఆహార ఉత్పత్తులు బదులు స్వగృహ ఫుడ్స్, ప్లాస్టిక్ బదులు మట్టి, పేపర్ ఉత్పత్తులు వాడడం ద్వారా పర్యావరణాన్ని ప్రోత్సహించడం, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్స్, కార్లు, కంప్యూటర్స్, రకరకాల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు కొనుగోళ్ళు తగ్గించి స్థానిక పర్యావరణ వస్తువుల వాడకం పెంచాలి. గ్రామాల్లో నీళ్ళ ప్యాకెట్లు, కోకోకోలా స్థానే కుండల్లో నీళ్ళు ప్రతివీధి చివర ఏర్పాటు చేయాలి. మజ్జిగ, కొబ్బరి బొండాలు, షరబత్‌లు త్రాగాలి. ప్రజలకు పనికిరాని వ్యర్థ పదార్థాలను పట్టిక ప్రకటించి వాటి కొనుగోలు చేయకుండా ఆయా గ్రామ కమిటీలు చూడాల్సి వుంది.

వ్యవసాయరంగంలో విత్తనాలు, గ్రామాలలోనే తయారు చేసుకోవాలి. పేరున్న కంపెనీలు, బ్రాండ్ గ్యారంటీ లేకపోతే డబ్బు వాపస్ చేయాలని, పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయా కంపెనీలను డిమాండ్ చేయాలి. ఆరకమైన బాధ్యత ఆ కంపెనీలు వహించకపోతే ఆ కంపెనీ ఉత్పత్తులను బహిష్కరించాలి.

గ్రామీణ ప్రాంతాలలో బ్యాంక్‌లు రైతులకు విధిగా రుణాలు మంజూరు చేయాలి. గ్రామీణ ప్రాంతాల నుండి బ్యాంక్‌లకు వస్తున్న ఆదాయంను వేరే రంగాల వారికి, వ్యాపారస్తులకు ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించ కూడదు. గ్రామ కమిటీలు బాధ్యత వహించిన వ్యక్తులకు విధిగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలి. బ్యాంక్ కార్యకలాపాల పై ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి.

మనదేశంలో తయారయ్యే వస్తువులను దేశంలోని మార్కెట్లలో అమ్ముకోవాలి. ఎగుమతుల పేరిట బయట మార్కెట్ ఆధారపడతగినది కాదు. ప్రజలకవసరం లేని వాటిని బహిష్కరించాలి. తద్వారా దేశీయ వస్తువులు అమ్ముడయి అనేక మందికి ఉపాధి లభిస్తుంది. సహకార ఉద్యమ స్ఫూర్తికి ప్రజలు ముందుకు రావాలి. ప్రజలు ఒక శక్తిగా తయారైతే మన మార్కెట్‌ను కోల్పోకుండా ప్రజల ఉపాధికి గ్యారంటీ కల్పించవచ్చు. విదేశీ బహుళజాతి మార్కెట్ విస్తరణను అడ్డుకొని, సహకార ఉద్యమ స్ఫూర్తితో పట్టణ ప్రాంతాలలోని మధ్యతరగతి వర్గాల సహకారంతో వ్యవసాయ ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాలలో ప్రాసెసింగ్ చేసి పట్టణాలకు సరఫరా చేయడం ద్వారా దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి. దీనికి ఆటంకంగా వున్న ప్రభుత్వ విధానాలు, ఏరూపంలో వున్నా రాజీలేకుండా పోరాడి రద్దు చేయాలి. గ్రామ కమిటీల అనుమతి లేకుండా ఎటువంటి భూమి కంపెనీలు కొనుగోలు చేయరాదు. ప్రజల ఆస్తులని పారిశ్రామిక వేత్తలకు ధారపోయడాన్ని అనుమతించరాదు. చేనేత రంగంలో సహకార వ్యవస్థ ద్వారా చీరలు ఉత్పత్తి చేయాలి. పత్తి పండించే రైతులు దారం తయారు చేసి ముడి నూలును నేతలకు అందించాలి. గతకాలపు లింకులు కలపగలిగితే ప్రజల మధ్య ఐక్యత ఏర్పడి సహకార స్ఫూర్తితో పరస్పరం సహకరించుకోవడం ద్వారానే విదేశీ మార్కెట్‌ను తరిమికొట్టగలుగుతాం. మధ్య దళారీలను రద్దుచేసి ప్రజల నుండి ప్రజలకు సూత్రం ద్వారా ఉత్పత్తి దారులు, వినియోగదారుల మధ్య ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పడం, మన మార్కెట్‌లో బయట వస్తువులు నిరోధించడం ద్వారా దేశీయ మార్కెట్, సహకార వ్యవస్థ అభివృద్ధికి కృషిచేయాలి.

దేశంలో విచ్చలవిడిగా పెట్రోలు వాడకం పెరుగుతోంది. రాజకీయ నాయకులు, దళారీలు విలాసవంతమైన కార్లు, మోటారు సైకిళ్ళు కొనుగోళ్ళను నిరుత్సాహపరచాలి. ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి పరిచి చవకగా ప్రయాణ సౌకర్యాలు కల్పించాలి. వాహన కాలుష్యాన్ని రవాణా సౌకర్యాల పెంపుతో వ్యక్తిగత వాహనాల నియంత్రణ ద్వారా మెరుగుపరచాలి. మెట్రో, ఎ.సి. ఎక్స్‌ప్రెస్, తరగతులు రద్దుచేసి అందరికి ఒకే రకమైన సర్వీసులను సరసమైన ధరకు రవాణా సౌకర్యం ఉండాలి.

ప్రభుత్వ ఆస్పత్రులను సక్రమంగా పనిచేసేందుకు గ్రామకమిటీలు బాధ్యత వహించాలి. ప్రభుత్వ ఆస్పత్రులకు కేటాయించే నిధులు, మందులు పంచాయితీల ద్వారా అందించడం ద్వారా గ్రామ కమిటీలే ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను నిర్వహించాలి. కార్పోరేట్ ఆస్పత్రులకు, ప్రైవేట్ ఆస్పత్రులకు ఎట్టి పరిస్థితులలోనూ వెళ్ళరాదు. ప్రభుత్వం బడ్జెట్ ద్వారా నిధులు ఖచ్చితంగా పంచాయితీలకు ఇవ్వడం, గ్రామకమిటీలు ఆయా ఆస్పత్రుల అభివృద్ధికి బాధ్యత వహించడం చేయాలి. ప్రభుత్వోద్యోగులకు కాని, రాజకీయ నాయకులకుగాని ప్రైవేటు వైద్యం, కార్పొరేట్ వైద్యం ఆపేస్తే అందరూ విధిగా ప్రభుత్వాస్పత్రులకు వెళ్ళటంతో అక్కడ సౌకర్యాలు బాగుపడతాయి. సామాన్యుడి బ్రతుకు బాగుపడుతుంది. వేలకోట్ల ప్రభుత్వ ధనం ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రులకివ్వటం ఆగుతుంది. వైద్య బడ్జెట్ రెట్టింపు చేయాలి.

విద్యారంగంలో కూడా ప్రైవేట్ స్కూళ్ళు నిరోధించి ప్రజల సహకారంతో విద్యాలయాలు సక్రమంగా నడపాలి. ఇలా అన్ని రంగాలలో ప్రైవేట్ జోక్యాన్ని మార్కెట్ విస్తరణను ఎదుర్కోవడం ద్వారా స్వదేశీ మార్కెట్ రక్షణకు కృషి చేయవల్సిందిగా దేశభక్తులైన మేధావులు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

దేశంలో పట్టణ, గ్రామీణ, ప్రాంతాల మధ్య ప్రజల నిష్పత్తి బట్టి 70:30 శాతం నిధులు కేటాయించాలి. ప్రజలకు ఉపాధి కల్పనకే ప్రాధాన్యత ఇచ్చే పరిశ్రమలు నెలకొల్పాలి. వ్యవసాయం అనుబంధ వృత్తులు, చిన్నతరహా పరిశ్రమలు ద్వారా గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కృషిచేసే అభివృద్ధి విధానాన్ని అనుసరించాలి. అమెరికా, యూరప్‌లలో అనుసరించే రక్షిత విధానాలు మనదేశంలో ప్రజలకు కూడా అమలుచేయాలి. ఈ అభివృద్ధి నమూనా ప్రాతిపదికగా గ్రామీణ ప్రజల్ని కార్యోన్ముఖుల్నిచేసి దేశీయ మార్కెట్ వికాసానికి ప్రతీఒక్కరూ కృషిచేయాలని విజ్ఞప్తిచేస్తున్నాం. పెద్ద పారిశ్రామిక వస్తు బహిష్కరించాల్సిందిగా కోరుతున్నాం.

కె.జె.ఆర్. తో నారాయణరావు

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

## విదేశీ పెట్టుబడులు (51 శాతం పైగా) ప్రవేశాన్ని నిరసిస్తూ 22-2-2012న ఢిల్లీ జంతర్‌మంతర్ నుండి చిల్లర దుకాణాదారుల భారీ ర్యాలి

22 ఫిబ్రవరి 2012న భారతీయ ఉద్యోగ వ్యాపార మండలి ఆధ్వర్యంలో చిల్లరదుకాణాల వ్యాపారులు భారత ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలకు 51శాతం పైగా పెట్టుబడితో ప్రవేశాన్ని అనుమతించడం నిరసిస్తూ జంతర్‌మంతర్ నుండి భారీ ర్యాలిని నిర్వహించారు. ప్రదర్శన పార్లమెంటు వద్దకు చేరగానే పోలీసులు అడ్డుకున్నారు.

వ్యాపారి వ్యవసాయ ఏకోపన సమితి పేర కేరళ నుండి 5000 మంది కిరాణ, చిల్లర వర్తకులు, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మరియు ఢిల్లీ నుండి ఈ నిరసనలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయానికి పెద్ద ఎత్తున నిరసన తెలియ చేసినా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తే ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తామని బహుళజాతి కంపెనీలకు వారి నమ్మిన బంట్లయిన పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రిటైల్ వ్యాపారాన్ని మాత్రమేగాక ఈచర్య వలన రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోతుందని అంతేగాక ఎరువుల లభ్యత తగ్గిపోతుందని పేర్కొన్నారు.

కేరళ నాయకుడు నజీరుద్దీన్ ప్రసంగిస్తూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో పెట్టుబడులు 51 శాతం కన్నా ఎక్కువగా అనుమతించడంను వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం ముందుకెడుతోందని తెలిపారు.

భారతీయ ఉద్యోగ వ్యాపార మండల్ అధ్యక్షులు శ్యామ్‌బిహారి నిరసన ప్రదర్శననుద్దేశించి ప్రసంగిస్తూ విదేశీ కంపెనీలకు మన మార్కెట్‌లో స్థానంలేదని వారి ప్రవేశాన్ని నిరోదిస్తామని ఆదిశగా ఉద్యమం ముందుకు తీసుకెళ్ళాలని పేర్కొన్నారు.

- లోకవిద్య ప్రతినిధి - ఢిల్లీ

**జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.**

# లోకవిద్య జన ఆందోళన సదస్సు

**తేదీలు : 24 మరియు 25 మే, 2012 స్థలం : బి.వి. & బి.యస్. హైస్కూల్, జాండ్రపేట. చీరాల.**

ప్రియమైన ప్రజలారా!

మన దేశంలో అభివృద్ధి పేరుతో జరుగుచున్న ప్రాజెక్టులన్నియు పర్యావరణ సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అభివృద్ధి లేకుండా ఉపాధి కల్పించడం సాధ్యం కాదంటూ, అందుకు ప్రజలు సహకరించాలంటూ ప్రకృతి ప్రసాదించిన మంచి గాలిని, నీటిని, కలుషితం చేస్తూ, పర్యావరణాన్ని కాపాడే జీవరాశులను నాశనం చేస్తున్నారు. ఈ విధమైన ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రజాసమూహాలు ఉద్యమిస్తున్నాయి.

ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో పేద రైతుల పట్టా భూములకు, ప్రభుత్వం పేదలకిచ్చిన అస్సైన్డ్ భూములను అతి తక్కువ ధరను నిర్ణయించి పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తోంది. అంతేగాక వీరికి రిజిస్ట్రేషన్ ఫీజు రాయితీలు, వడ్డీ రాయితీలు, కరంట్ సబ్సిడీలతోపాటు యంత్రాల దిగుమతులపై సుంకాల తగ్గింపు చేశాయి. కానీ పేదల జీవితాలు బాగుపడటానికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు నిధులు లేక అవసరము ఉన్న పేదలలో 15% మందికి మాత్రమే పథకాలను అమలు జరుగుచున్నాయి.

ప్రపంచీకరణ పేరుతో అనువంశిక వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వారంతా వృత్తులలో వచ్చిన పెనుసంక్షోభాల ఫలితంగా వృత్తులు వదిలి వేరే వృత్తులకు వెళ్ళడం, కొందరు ఏ వృత్తిలోను ఉపాధి పొందలేక వీధులపాలవుతున్నారు. ఈ విధంగా మన దేశంలో 20 కోట్లమంది నిరుద్యోగ సమస్యను అనుభవిస్తున్నట్లుగా ప్రపంచకార్మిక సంస్థ చెబుతున్నది. విశాల మార్కెట్ అవకాశాలున్న మన భారతదేశంలో ఉత్పత్తి రంగాలను నిర్వీర్యంచేసి, నిరుద్యోగాన్ని పెంచుతున్న ప్రభుత్వ విధానాలే ప్రజల వ్యతిరేకతకు ప్రధానకారణం. ప్రజల నిరసనలు తట్టుకోలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాలైన క్రూర చట్టాలను అమలు చేస్తూ, ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి.,

అంతేగాక, వ్యవసాయక దేశమైన భారతదేశంలో ఆహారపు కొరత ఏర్పడ్డది. పేదలకు తగిన పోషకాలు అందించే పప్పుదినుసులు, నూనెలకు సంబంధించిన ఆహార ఉత్పత్తులు పూర్తిగా తగ్గిపోయి, ధరలు విపరీతంగా పెరగడమేగాక, పేదప్రజలంతా పోషకార లోపంతో వచ్చే జబ్బులకు గురౌతున్నారు. దీనికంతటికి సెజ్‌ల పేరుతో జరిగిన "భూపందేరం" ప్రధాన కారణమని లోక విద్య ప్రపంచం గట్టిగా విశ్వసిస్తుంది.

పప్పుధాన్యాలు, ప్రత్తి, వరి, గోధుమ, పసుపు పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఉద్యమాలు చేస్తున్నారు. రైతాంగానికి సబ్సిడీలను తగ్గించి, కనీస మద్దతు ధరను పెంచలేమని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి "ఋణమాఫీ" పేరుతో ఓట్ల రాజకీయాలు చేస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం కేటాయించాల్సిన దళిత సబ్‌ప్లాన్ బడ్జెట్ కేటాయింపులను చేయకుండా దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు.

ఇందులో భాగంగానే, రైతుల ఆహార భద్రతా ఉద్యమాలు, కార్మిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాల సంస్కరణలకు వ్యతిరేకంగా, వృత్తుల సంక్షోభాన్ని సృష్టిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అనేకచోట్ల ఉద్యమాలు జరుగుతున్నాయి. ఇటువంటి ఉద్యమాలు జరుగుతున్నప్పుడు వివిధ రాజకీయ పార్టీల "ఊసరవెల్లి" రూపాలను ప్రజలు గమనిస్తూనే, ఉద్యమ పటిష్ఠతను కొనసాగిస్తూ విజయం వైపు ముందువెళ్తున్నారు.

పై పరిస్థితులను పరిశీలించినపుడు "నేటి శాస్త్ర సాంకేతిక రంగాలను సంబంధించిన విజ్ఞానమే జ్ఞానమని చలామణి చేస్తున్న నమ్మకాన్ని ఈరోజు ప్రజలు నిర్ద్వందంగా తిరస్కరిస్తూ, ప్రకృతినుండి నేర్చుకున్న లోక విద్యాజ్ఞానం తమ అనుభవంతో అభివృద్ధి చేసుకున్న జ్ఞానమే అసలైన జ్ఞానంగా నొక్కి చెప్తూ, మన దేశంలోని వివిధ వృత్తులు వారు జీవనోపాధి పొందుతున్నారు. అదే విధంగా సన్న, చిన్నకారు రైతాంగం, వ్యవసాయ కూలీలు వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా ఎప్పటికప్పుడు తమ స్వీయ అనుభవాలతో, అవగాహనలతో పంటలు పండిస్తున్నారు.

కాబట్టి లోక్‌విద్య ద్వారా ప్రస్తుత సంక్షోభ పరిస్థితులను అవగాహన చేసుకొని నివారణ, పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రయత్నంలో లోక్‌విద్యా జన ఆందోళన సదస్సును నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులో వివిధ వృత్తులవారు, కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**ది. 24-5-2012 గురువారం కార్యక్రమము వివరములు**

**ఉదయం గం॥ 9-00 నుండి గం॥ 9-30 ని॥లకు**

**లోకవిద్య లక్ష్యం - ప్రణాళికపై అవగాహణ - ప్రొ॥ కృష్ణంరాజులు, హైదరాబాద్**

**ఉదయం గం॥ 9-30 నుండి గం॥ 10-30 ని॥లకు**

**ప్రపంచీకరణ - కార్మిక చట్టాల సంస్కరణలు - బి. కొండారెడ్డి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య**

**ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి మధ్యాహ్నం గం॥ 12-00 ల వరకు**

**వ్యవసాయరంగం - చిన్న నీటిపారుదల వనరులు - కె.జె. రామారావు**

**మధ్యాహ్నం గం॥ 12-15 ని॥ల నుండి మధ్యాహ్నం గం॥ 1-15 ని॥ల వరకు**

**సోంపేట, కాకరపల్లి ఉద్యమ అనుభవాలు - బీన ఢిల్లీరావు, పర్యావరణ పరిరక్షణ సంస్థ, సోంపేట.**

**తమ్మినేని ధర్మారావు, థర్మల్ పోరాట కమిటి, కన్వీనర్, శ్రీకాకుళం.**

**మధ్యాహ్నం గం॥ 2-30 ని॥ల నుండి సాయంత్రం గం॥ 5-00 ల వరకు**

**ప్రశ్నలు-జవాబులు, సమన్వయ కర్త టి. నారాయణరావు, లోక్‌విద్య ప్రపంచం, ఎడిటర్.**

**ది. 25-5-2012 శుక్రవారం కార్యక్రమము వివరములు**

**ఉదయం గం॥ 9-30 ని॥ల నుండి గం॥ 11-00 ల వరకు**

**పర్యావరణం-అణు విద్యుత్ ప్రాజెక్టుల ప్రభావం**

**వక్త : కె. బాబురావు, సైంటిస్ట్ రిటైర్డ్ ఐ.ఐ.సి.టి., హైదరాబాద్.**

**ఉదయం గం॥ 11-00 ల నుండి మధ్యాహ్నం గం॥ 12-30 ని॥ల వరకు**

**భారత రాజ్యాంగం-గిరిజన హక్కులు - వలిగి ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్ ఎరుకుల హక్కుల పోరాట సమితి.**

**మధ్యాహ్నం గం. 2-30 ని॥ల నుండి గం॥ 3-30 ని॥ల వరకు**

**దళిత, సామాజిక, ప్రత్యామ్నాయ ఉద్యమాలు - దుర్గం సుబ్బారావు**

**మధ్యాహ్నం గం॥ 3-30 ని॥ల నుండి గం॥ 4-30 ని॥ల వరకు**

**లోక్‌విద్యపై అవగాహన - సునీల్ సహస్ర బుద్దే, విద్యాశ్రమం, వారణాశి. ప్రొ॥ కృష్ణంరాజులు, హైదరాబాద్**

**సాయంత్రం గం॥ 6-00 లకు "బహిరంగ సభ"**

**జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.**

# జయప్రదమైన రైతాంగ సమాఖ్య - కోస్తాంధ్ర సదస్సు

రైతాంగ సమాఖ్య. ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కోస్తాంధ్రలో 25-3-2012 ఆదివారం మధ్యాహ్నం 2.30 గ॥లకు సి.ఆర్. రెడ్డి పబ్లిక్ స్కూల్, ఏలూరులో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కృష్ణాజిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల రైతులు 2000 మందితో పాటు ఇతర జిల్లాల వారూ పాల్గొన్నారు.

పంటపండించే రైతుకు గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదని, గత సంవత్సరం మిర్చిధర, 8 వేలనుండి 4 వేలకు, పసుపు 12 వేల నుండి 4 వేలకు, పత్తి 5800 నుండి 3200/- మినుములు 4800 నుండి 3200 కు, కందులు 4000 నుండి 2450 కు, సోనామసూరి 1100 నుండి 850కు, కొబ్బరికాయ 5.00 నుండి 1.50 తగ్గించి వేసారని, కూరగాయల ధర లేక రైతులు పారబోస్తుంటే కొనే వారికే కిలో రూ. 20 నుండి 40 రూ. వరకు అమ్ముతూ మధ్యదళారులు రైతుల కష్టాన్ని కాజేస్తున్నారని, దివాళతీసిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నాగేంద్రనాథ్ అన్నారు.

సమాజంలో ఉద్యోగులకు, కార్మికులకు, పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులకు జీతాలు పెరుగుతాయి. కాని రైతులకు గిట్టుబాటు రేట్లు ఇస్తే ధరలు పెరుగుతాయని కుంటిసాకులు చెబుతున్నారు. పెరిగే ధరలకు కళ్ళెం వేయడం చేతకావడం లేదు. పాలు, గ్యాస్, కిరోసిన్, డిజిల్, పెట్రోలు, బస్సురేట్లు, అన్ని పెంచేస్తున్నారు. రైతులను దివాళా తీయిస్తున్నారు, అని మాగంటి సీతారామస్వామి వాపోయారు.

దేశంలో అన్ని వర్గాలవారు సంఘాలుగా ఏర్పడి ఉద్యమిస్తుంటే రైతులు దేశానికి కావల్సిన ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసి ఆకలిచావులకు గురవుతున్నారు. రైతులు సంఘటితపడి పాలకులను నిలవేయాల్సిన అవసరం వుందని రైతు సంఘాల ప్రతినిధులు వడ్డి వీరభద్రరావు మాట్లాడారు.

జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ బియ్యం ఎగుమతికి అనుమతించాలని అమ్మపెట్టదు అడుక్కు తిననివ్వదన్నట్లుగా ప్రభుత్వం గిట్టుబాటురేటు అమలు చేయదు. ఎగుమతికి అనుమతించక రైతులు నష్టపోతున్నారని ఈ సంవత్సరం రైతాంగం పెద్ద ఎత్తున కదిలి 25వేల కింటాళ్ళ వరకు ఎగుమతి చేయడం వలన రైతులకు న్యాయమైన ధర లభించిందని మన దగ్గర నిల్వ ఉన్న బియ్యం కూడా ఎగుమతులకు అనుమతిస్తే రైతులకు న్యాయం జరుగుతుందని ప్రకటించారు.

పోలవరం ప్రాజెక్టు టెండర్లు పిలిచి రద్దు చేసారని మళ్ళీ ఎప్పుడు టెండర్లు పిలుస్తారో తెలియడంలేదని, తెలంగాణావారు మోకాలడ్డుతుంటే పోలవరం నిర్మాణం వాయిదా వేస్తే రైతాంగం చూస్తూ వూరుకోదని రైతులు మేల్కొంటే ప్రభుత్వాలు దిగివస్తాయని తెలిపారు. అంతేగాక పోలవరం నిర్మాణం వలన ఎగువ రాష్ట్రాల నుండి కృష్ణానదిలోకి నీరు రాకపోయినా గోదావరి నుండి తరలించడం వలన కృష్ణా, డెల్టాకు నీరందుతుందని, కృష్ణానది క్రింది తెలంగాణా జిల్లాలు, పోలవరం రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల ద్వారా మరికొన్ని జిల్లాలు లాభపడతాయని జయప్రకాష్ నారాయణ అభిప్రాయపడ్డారు. గోదావరి డెల్టాకు నికర జలాలు వస్తాయని, దీనివలన పై నుండి వచ్చే నీరు రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలకు వినియోగించవచ్చని ఉభయతారకంగా అందరికి ప్రయోజనం కల్గుతుందని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తక్షణం మొదలుపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

రైతాంగం సమాఖ్య నాయకులు వివిధ ప్రాంతాలలో రైతులను సమీకరించేందుకు జరిగిన కృషిని వివరించి రైతులు ఏకమై బలమైన శక్తిగా ఎదగాలని, పాలకుల పై వత్తిడి చేసి గిట్టుబాటురేట్లు సాధించుకోవాలని చెప్పారు.

లోకవిద్య ప్రపంచం ఎడిటర్ నారాయణరావు, రామారావులు సదస్సులో పాల్గొని, లోకవిద్య ప్రపంచం ప్రతులను రైతు నాయకులకు పంచిపెట్టి రైతాంగ ఉద్యమానికి సంఘీబావం తెలియచేసారు.

**- లోకవిద్య ప్రతినిధి -ఏలూరు**

# విజయవంతమైన చీరాల చేనేత కార్మికుల మజూరీల పోరాటం

చీరాల ప్రాంతంలో మాస్టర్ లీవర్ల వ్యవస్థ బలంగా వుంది. గత అనేక సం॥రాలుగా కార్మికుల మధ్య ఐక్యత లోపించడం, ప్రభుత్వం చేనేతరంగంలో సహకార వ్యవస్థను సక్రమంగా పనిచేయించకపోవడం, మాస్టర్ వీవర్లే సహకార సంఘం యాజమానులుగా వుండి, మరమగ్గాల ఉత్పత్తులు చేనేతగా అమ్మడం, నూలు, రంగుల ధరలు పెరగడంతో ఆ భారం కార్మికుల పై వేసి తమలాభాలు మాత్రం గ్యారంటీగా దండుకుంటున్నారు. చాలీచాలని మజూరీలతో ఆకలి, పస్తులు, అనారోగ్యాలు సర్వసాధారణం అయ్యాయి. కార్మికులలో అనేక మంది వృత్తిని వదిలి ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు.

గత 15 సం॥రాలుగా మజూరీల రేట్లు పెరగకపోవడానికి మాస్టర్ వీవర్ల శ్రమదోపిడికి వ్యతిరేకంగా పోరాడేందుకు కార్మికుల ముందుకు రాకపోవడం, గట్టిగా మాట్లాడితే ఉపాధి కోల్పోయే పరిస్థితులు, కొన్ని కార్మిక సంఘాల నాయకత్వం మాస్టర్ వీవర్లతో కుమ్మక్కై, పోరాటం చేయడానికి సంసిద్ధత లేకపోవడం, ఆప్కో, జౌళీశాఖ, కార్మికశాఖలు, వేలాది కార్మికుల రక్తాన్ని జుర్రుకుంటున్న మాస్టర్ వీవర్లతో కుమ్మక్కవడం, తెలుగుదేశం పార్టీ నుండి నేటి కాంగ్రెస్ పాలన వరకు చేనేతరంగం పునరుద్ధరణకు జిల్లాలనుండి ఢిల్లీ వరకు, ప్లానింగ్ కమిషన్, జౌళీశాఖలకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పాలకులు వాగ్దనాలే తప్ప నిర్దిష్టచర్యలు చేపట్టింది లేదు. దీనితో ఆత్మహత్యలు పెరిగాయి.

2010 సం॥లో మజూరీ పెంపుదలకు అంగీకరించినా మాస్టర్ లీవర్లు అమలు చేయకుండా ఆచరణలో తూట్లుపొడిచారు. ఉప్పు, పప్పులు, బియ్యం రేట్లు రెట్టింపయ్యాయి. కూరగాయల రేట్లు 4 రెట్లు పెరిగాయి. కిరోసిన్ రేట్లు 4 రెట్లు పెరిగింది. ప్రభుత్వం కరెంట్ ఛార్జీ, బస్సు ఛార్జీలు పెంచింది. గ్యాస్ సిలిండర్‌కు 100 రూ. పెంచింది. ఏదారీలేక విసుగుచెంది నిరాశ నిర్లిప్తలతో వ్యసన పరులయి జీవచ్ఛవాలుగా బతుకు వెళ్ళదీస్తున్నారు.

ఈ నేపథ్యంలో చేనేత కార్మిక సమాఖ్య ఇతర సంఘాలతో కలిసి కార్మికులను కదిలించడం, పాత తరం వారిని పక్కనపెట్టి కొత్తవారి ఆధ్వర్యంలో సంఘటితంగా కదిలించడం, ఈసారి కార్మికుల పక్షం నిలబడకపోతే తమకు పరపతి దక్కదన్న భయంతో ఇతర సంఘాలు కూడా పరిస్థితి తీవ్రత గమనించి ఐక్యంగా నిలబడడంతో విజయం లభించింది. మాస్టర్ వీవర్లతో ఒప్పందం కుదిరింది.

రూ. 500లు - 900 రూ॥ల మధ్య రకం చీరలు రకాలపై 175 రూ॥లు, రూ. 900-1600ల రకంపై 225/- 1600 రూ॥పైన రకాలకు 300 చొప్పున మజూరీలు పెరిగాయి. అంతేగాక ఉత్పత్తి రకాల మార్పిడి ఖర్చులు మాస్టర్ వీవర్లే భరించేటట్లుగా అంగీకరించడం జరిగింది.

గత అనుభవాల రీత్యా దొంగనాయకులు, మాస్టర్ వీవర్ల మోసాలకు గురికాకుండా ఎటువంటి అవకతవకలు చేయకుండా కార్మికులు ఐక్యంగా మజూరీల పెంపును అమలు జరిగేటట్లు చూడాలని నిర్ణయించారు. కార్మికుల ఐక్యతతో సాధించుకున్న విజయాల్ని మేడే సందర్భంగా విజయోత్సవం జరుపుకుందాం. పోరాడితే సాధించలేనిది లేదు. మరిన్ని పోరాటాలకు సిద్ధంకండి. ఐక్యతను బలోపేతం చేయండి అనే తీర్మానాలు చేశారు.

**- లోకవిద్య ప్రతినిధి -చీరాల**

**అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే**

# స్థానిక మార్కెట్లను బలోపేతం చేయండి - ప్రజల ఆర్థిక పరిపుష్టిని పెంచండి.

మన దేశంలో వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్, భాజాపా, అన్నా డింఎంకె, డి.ఎంకె, బిజూజనతా దళ్, మార్క్సిస్టు, నేషనల్ కాన్ఫరెన్స్, నేషనల్ కాంగ్రెస్, తృణముల్ కాంగ్రేస్, తెలుగుదేశం పార్టీలు వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చి పరిపాలన చేసాయి. అందరిది స్థూలంగా ఒకటే అభివృద్ధి నమూనా. దీని ప్రత్యామ్నాయంగా లోకజనాందోళన ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ల నిర్మాణంలోనే ప్రజల విముక్తి అనే సందేశాన్ని ఇవ్వటానికి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ చుట్టూ వున్న గ్రామాల ప్రజలని, పట్టణ బీదలని సమీకరించి గొలుసుకట్టు సభలు సమావేశాలు జరిపి స్థానిక మార్కెట్ యొక్క ఆవశ్యకతను తెలియచేస్తూ ప్రచారం చేసారు. అన్ని రాజకీయ పార్టీల అభివృద్ధి నమూనాలు గూర్చి వివరించడం జరిగింది. 1) పెద్ద పెట్టుబడితో పారిశ్రామిక ఉత్పత్తి వేగంగా పెరుగుతుందని, కానీ అంతే వేగంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుందని. 2) ఇటువంటి వేగమైన అభివృద్ధిలో గ్రామాలకు గ్రామాలనే పారిశ్రామికరంగం మింగేస్తుందని, పెద్ద పెద్ద నీటిపారుదల రిజర్వాయర్లలో సారవంతమైన భూములతో పాటు జనా వాసాలు ముంపుకు గురయి ప్రజలు నిరాశ్రయులవుతారని అత్యంత వేగంగా సరుకు రవాణా రోడ్లను నిర్మించడంవలన స్థానికంగా తయారైన వస్తువులు సుదూర ప్రాంతాలకు వెళ్ళడంతోపాటు, స్థానికులకు అందకుండా పోతాయని, అంతేగాక వారి పొలాలు, ఆవాసాలు రహదారులకింద కలిసిపోతాయని నేటి కంప్యూటర్ కంపెనీలు, మొబైల్ కంపెనీలు, కార్పొరేట్ ఆస్పత్రులు, అంతర్జాతీయ ఆటస్థలాలు, అంతర్జాతీయ సాంకేతిక విద్యాలయాల స్థాపనతో కొద్దిమందికి ఉద్యోగ అవకాశాలు వచ్చినా ప్రజా బాహుళ్యానికి కొనుగోలు శక్తి తరుగుతుందని ప్రచారం చేశారు.. ఒక పక్క లక్షల రూపాయల జీతాల ఉద్యోగులతో పోటీ పడలేని బడుగు జీవులు మరింత అభద్రతకు, ఆత్మన్యూనతా భావానికి లోనవుతారు.

ఈ పరిస్థితుల్లో ప్రత్నామ్నాయ నమూనా మార్గాలను స్థానిక ప్రజలే నిర్ణయించుకోవాలని విస్తృతంగా అనేక ప్రాంతాలలో ఇండోర్, దేవాస్, నిమాధ్, ధర్, జగువా, రత్లాం మొదలైన చోట జరిగిన అభివృద్ధిలో రైతుల, చేతివృత్తులవారి, కళాకారుల ఆదివాసీల చిన్నవ్యాపారుల, స్త్రీల జీవితాల్లోంచి అనేక చిన్న ఉద్యోగాలు కోల్పోవడం గూర్చి చర్చించడం జరిగింది.

ఈ ప్రాంత ప్రజలు ఊరేగింపు ప్రదర్శనల ద్వారా లోకవిద్యతో నూతన ప్రపంచ ఆవిష్కరణతో మాత్రమే కుటుంబాలు తద్వారా సమాజం అందరికి ఉపాధి దొరుకుతుందని ప్రచారం సాగించారు. లోకవిద్యలో ఉన్న జ్ఞానంతో మానవ సంబంధాలు మెరుగుపడడం, పర్యావరణం రక్షించబడటం కుటుంబ వ్యవస్థ వడిదుడుకులకు లోనుకాకుండా జీవించడం వంటి అంశాలు కూడా చర్చించడం జరిగింది.

ఈనూతన విద్యావిధానంలో సమాజ ప్రజలందరిని వేతనాలకు పనిచేసే కూలీలుగా మార్చే ప్రయత్నాన్ని గర్హించడం జరిగింది. వివిధ ప్రాంతాలలోని ప్రజలు స్థానికంగా వారి ప్రణాళికా బద్ధమైన లోకవిద్యా ప్రపంచాన్ని నిర్మించుకుంటూ మొత్తం భారతజాతి విముక్తికి కృషి చేయాలని పిలుపివ్వడం జరిగింది.

ఈ మార్పుకోసం పనిచేయడంలోనే స్థానిక బజార్లు ఏర్పాటు చేసుకోవాలని, స్థానిక ఉత్పత్తుల వినియోగం పెంచాలని, వాటికి మంచి ధర చెల్లించి కొనుగోళ్ళు పెంచడం ద్వారా స్థానికంగా ప్రజల కొనుగోలు శక్తి పెంచాలని దీనికోసం ఈకింది చర్యలను చేపట్టాలని నిర్ణయించడం జరిగింది.

1. ప్రతీ గ్రామం పట్టణంలోనూ స్థానిక వస్తువులతో సంతలు నిర్వహించాలి.
2. కంపెనీ వస్తువులు కాకుండా గృహాలలో తయారుచేసిన శుచిగా, రుచిగా, తయారుచేసిన తినుబండారాలను మాత్రమే కొనుగోలు చేయాలని
3. పెద్ద కంపెనీల తినుబండారాలను శీతల పానీయాల్ని తిరస్కరించాలని
4. ఇటువంటి స్థానిక బజార్ల వలన కొనుగోలు దారుడికి, ఉత్పత్తి దారుడికి ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడడంతో మానవ సంబంధాలు మెరుగుపడతాయని, లాభాల స్టానే సేవాభావం ఫరిడ విల్లుతుందని
5. మంచిధర చెల్లించడం వలన రైతుల ఆర్థిక స్థితులు బాగుపడడంతో పాటు ఆత్మహత్యలు తగ్గుముఖం పడతాయని

ఇటువంటి వస్తువుల తయారీలో పెద్ద ఎత్తున మహిళలు భాగస్వాములై ఆర్థిక పుష్టి చెందుతారని, ఈ సంతలలో పెద్ద కంపెనీల వస్తువులు, కేవలం లాభ పేక్షతో ఉత్పత్తిచేసే వస్తువులు అమ్మకపోవడం వలన అందరికి నూతన మానవ సంబంధాలు విలువలు పెరుగుతాయని, కనీస వేతనాలు అందరికి లభిస్తాయని సమావేశాల్లో అభిప్రాయం వ్యక్తమైంది.

ఇటువంటి లోకవిద్యా సంతలు, బజార్ల కోసం పెద్ద ఎత్తున కరపత్రాలు పంచడం, ఈదిశగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈనూతన వ్యవస్థలోనే అందరికి కనీస వేతనాలు లభించడం ద్వారా ఆర్థిక పరిపుష్టి చెందుతారని ప్రజలందరిలో విశ్వాసం నెలకొల్పే ప్రయత్నం జరుగుతోంది. దీన్ని దేశవ్యాప్తంగా స్థానిక అభివృద్ధి కాముకులు ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**- సంజీవ్ కీర్తనే - మధ్యప్రదేశ్**

**జ్ఞానం లాభాలకోసం కాదు.**

# అణు విద్యుత్ కర్మాగారాలు నిర్మాణం - మానవాళికి విపత్తు

జపాన్‌లో పుకుషిమా అణువిద్యుత్ కర్మాగారంలో పేలుడు అనంతరం. బీభత్సకర దృశ్యాలను వీక్షించిన వారు ఆధునిక సాకేంతిక పరిజ్ఞానం ఉపయోగించే జపాన్‌లో జరిగిన ప్రమాదంతో మేల్కొని అనేక దేశాలలో అణు విద్యుత్ కేంద్రాల స్థాపనను విరమించుకొన్నారు. అయినా మనదేశంలోని పాలకులు అణువిద్యుత్ కంపెనీల వత్తిడికి లొంగి, దేశంలో విద్యుత్ కొరత తీరాలంటే అణు విద్యుత్ తప్ప వేరే మార్గం లేదని కోస్తాతీరప్రాంతాలలో అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

పుకుషిమా పరిణామాలతో దేశంలో అణు విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం అవుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో కూడన్‌గుళం అణు విద్యుత్ కేంద్రం 1000 మె.వా. శక్తిగల ప్లాంట్ నిర్మాణం తలపెట్టారు.

దీనికి వ్యతిరేకంగా మత్స్యకారులు, రైతులు, విద్యార్థులు, మేధావులు ఆందోళనలు చేస్తే తమిళనాడు, పారిశ్రామిక అభివృద్ధికి అణువిద్యుత్ ప్రాజెక్టు ఎంతో అవసరమని, ఈ ప్రాజెక్టు లేకుండా తమిళనాడు రాష్ట్రం అభివృద్ధి సాధించలేదని, ఈ ఉద్యమం వెనకాల విదేశీ శక్తులున్నాయని ప్రధాని మన్‌మోహన్ సింగ్ పార్లమెంటులో ప్రకటించాడు. మాజీ రాష్ట్రపతి, డా॥ అబ్దుల్‌కలాం కూడన్‌గుళం అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటును సమర్థించారు. నూటికినూరు శాతం రక్షణ వుందని, కాబట్టి ప్రజలు ఆందోళన విరమించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

దేశంలో అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఉత్పత్తవుతున్న విద్యుత్ మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో కేవలం 3 శాతం మాత్రమే. అణువిద్యుత్ కేంద్రాల నిర్వహణ, రక్షణ రంగం ఆధ్వర్యంలో అత్యంత రహస్యంగా జరుగుతోంది. దీని కార్య కలాపాలు, తీసుకుంటున్న రక్షణ చర్యలు, ఖర్చులు పారదర్శకంగా లేవని దిగుమతి చేసుకోవడం, చేసుకుందామనుకున్న సాంకేతిక పరిజ్ఞానం పుకుషిమా అణువిద్యుత్ కేంద్రం కన్నా లోపభూయిష్టమైందని, ప్రమాదాలకు అతీతంకాదని అణుశక్తి కమీషన్ శాస్త్రవేత్త సందేహం వెలిబుచ్చారు. ఈవిషయంపై ప్రజాప్రతినిధులు, అణుశాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో కమిటీ వేసి అణువిద్యుత్ కేంద్రాల భద్రతపై పరిశీలనకు అనుమతివ్వాలని కోరితే ప్రభుత్వం దేశరక్షణ పేరుతో తిరస్కరించింది.

భోపాల్ గ్యాస్ ప్రమాదం సంభవించినపుడు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బాధితులకు కనీస రక్షణ చర్యలు చేపట్టలేదు. గాయపడిన బాధితులకు ఏమందులు వాడాలో కూడా కార్బయిడ్ కంపెనీ చెప్పలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్బయిడ్ కంపెనీ యజమానులకు భద్రత కల్పించి దేశంనుండి గౌరవంగా సాగనంపారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తరువాత కళ్ళుపోయి, వికలాంగులై పుట్టిన పిల్లలు, బాధితులకు ఆరోగ్య సౌకర్యంగానీ, నష్టపరిహారంగానీ, ఈనాటి వరకు కంపెనీ చెల్లించలేదు. కార్బయిడ్ కంపెనీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం వివాదం అమెరికన్ కోర్టులో తేల్చుకోవాలి. అమెరికాకు దళారులుగా వున్న పాలకులు ప్రజల ఎడల చూపిన నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం భోపాల్ విషాదం.

పుకుషిమా అణు ప్రమాదం తరువాత భద్రతా చర్యల గూర్చి, అభివృద్ధి చెందిన దేశాలలో అమలులో వున్న పటిష్టమైన చట్టాలగూర్చి ప్రశ్నలు లేవనెత్తితే సమాధానం చెప్పకుండా దిగుమతి చేసుకునే అణు సాంకేతిక పరిజ్ఞానం గూర్చి కనీస జ్ఞానం లేకుండా నూటికి నూరు శాతం రక్షణకు హామీ ఇచ్చే కలాం, మన్‌మోహన్‌సింగ్‌లు శాస్త్రీయ దృక్పథంతో వివరించకుండా కట్టుకథలు చెబుతున్నారు.

భారతదేశంలో ప్రస్తుతం ఉత్పతవుతున్న విద్యుత్‌లో 100 మె.వాలో 40 మె.వా. పంపిణీ, ప్రసారంలో నష్టపోతున్నాం. పారిశ్రామిక అభివృద్ధి చెందిన స్వీడన్‌లో ఈ నష్టాలు 7 శాతం మాత్రమే. అనగా దేశంలో ఉత్పతవుతున్న 1,80,000 మె.వా. విద్యుత్‌లో 72000 మె.వా నష్టపోతున్నాం. ఈనష్టాలను తగ్గించేందుకు కృషిచేస్తే పంపిణీ సామర్థ్యాన్ని పెంచితే ప్రమాదకరమైన అణువిద్యుత్ కేంద్రాలు నిర్మించాల్సిన అవసరం వుండదు. దీన్ని గూర్చి పాలకులు మౌనం వహిస్తున్నారు. అణువిద్యుత్ పరిశ్రమ యజమానుల లాబీ వత్తిడికి పాలకులు లొంగి ప్రజల జీవన భద్రతకు ప్రమాదకరమైన అణువిద్యుత్ కేంద్రాల స్థాపనకు అభివృద్ధి పేరుతో ముందుకు తెస్తున్నారు.

జీవిత బీమా చేసే కంపెనీలు అణువిద్యుత్ కేంద్రాలను, భద్రత కలిగినవిగా భావించడం లేదు బీమా కంపెనీలు అణువిద్యుత్ ప్రమాదరహితమని భావించకపోవడం వలన డా॥ కలాం లాంటివారు ఈ కంపెనీలతో మాట్లాడి రక్షణ కల్గినవని ఒప్పించగలరా? అంతేగాదు కూడన్‌గుళం అణు విద్యుత్ కేంద్రం అంగీకరిస్తే 200 కోట్ల ప్యాకేజీ ప్రకటిస్తామని కలాం చెప్పారు. ఈ సహయంలో అందరికి మంచినీరు, ఉద్యోగాలు, కళాశాలలు, ఆసుపత్రులు నిర్మిస్తామని ఆశపెడుతున్నారు. అంటే ప్రజలు అంగీకరించకపోతే కనీస సౌకర్యాలు కల్పించరా?

అణువిద్యుత్ ప్రమాదాలు జరిగిన దేశాలలో జరిగిన ఈ విపత్తు నివారణకు అయిన ఖర్చులు పరిశీలిస్తే ఈ కింది విధంగా వుంది. 1986లో రష్యాలో చెర్నో బిల్ అణుప్రమాదం వలన బెలారస్ 13 బిలియన్ డాలర్లు. ఈ విపత్తువల్ల ఖర్చుచేసింది. 30 సం॥లలో జరిగిన నష్టాలు లెక్కిస్తే 235 బిలియన్ డాలర్లు. ఉక్రైన్‌లో చెర్నోబిల్‌లో ఇప్పటికి బడ్జెట్‌లో 6-7 శాతం ఖర్చు ప్రతీఏడు పునరావాస చర్యలకు వెచ్చించాల్సివస్తోంది.

పుకుషిమా, జపాన్ దాయిచీ అణువిద్యుత్ కేంద్రాన్ని మూసివేసేందుకు 30 సం॥లలో సం॥నకు 12 బిలియన్ డాలర్లనుండి 19 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని అంచనా వేసారు. కలుషితమయిన భూవాతావరణం, ఆరోగ్యఖర్చులు, ఆర్థిక నష్టాలు కాకుండా ఈ ఖర్చును అంచనావేశారు.

ప్రపంచంలో వివిధ దేశాలలో అణువిద్యుత్ కేంద్రాలను గ్యాస్ విద్యుత్ కేంద్రాలుగా మార్చి వేస్తున్నారు. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలండ్‌లోని షోర్‌హం అణుకేంద్రం గ్యాస్ విద్యుత్ కేంద్రంగా మార్చారు. ఒహియోలోని విలియం హెచ్. జమ్మర్ అణుకేంద్రం మరియు మిచిగాన్‌లోని మిడ్‌లాండ్ కేంద్రం ఈవిధంగా మార్పుచేసారు.

భారతదేశంలో భూమి నుండి గ్యాస్‌ను వెలిగి తీసేందుకు రిలయన్స్ కంపెనీకి అనుమతించారు. వారు వెలికి తీసిన గ్యాస్‌ను అధికరేట్లకు అమ్ముకుంటే పాలకులు నిద్ర నటిస్తున్నారు. రిలయన్స్‌తో ఒప్పందం రద్దుచేసి ఓ.ఎన్.జి.సి. ఆధ్వర్యంలో ప్రభుత్వం గ్యాస్ వెలికితీయాలి.

విద్యుత్ అవసరాలు పెంచే విధంగా విద్యుత్ ఆధార ఉత్పత్తులు కాకుండా విద్యుత్ ఆధారం లేని లోకవిద్య ఆధారిత ఉత్పత్తుల వినియోగం వలన విద్యుత్ ఆదాచేయొచ్చు. ఈనాడు ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తున్న విద్యుత్ అవసరాలు విద్యుత్ ప్రసారం పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా పూడ్చుకోవచ్చు. ఇతర దేశాలలో లాగా గ్యాస్ ఆధారిత విద్యుత్ పరిశ్రమలుగా మార్చి మన దేశంలోని సహజ వనరులైన గ్యాస్‌ని సరఫరా చేయొచ్చు. ఇవికాకుండా పవన విద్యుత్, జలవిద్యుత్, సౌరవిద్యుత్ వంటి ప్రత్యామాయ మార్గాలున్నాయి. మానవాళి వినాశానికి తోడ్ప.డే అణువిద్యుత్ కేంద్రాలు నిర్బంధంగా ఏర్పాటుచేస్తే ప్రజల తిరగబడి పాలకులను చెత్తబుట్టలోకి నెట్టివేయడం తప్ప మరో మార్గంలేదు.

**- కె.జె. రామారావు**

ఆధారం : నిత్యానందజయరామన్, జి. సుందరరాజన్, చెనై సాలిడారిటీ గ్రూపు ఫ్యాక్ట్ షీట్

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

**జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు**

**జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.**

# ہندوستان کی عوام اور اسکی گربت — حصہ ۳

انسان ایک دماغی ہستی ہے. اسکی حاجتوں میں سے صرف ایک ضرورت اسکی پیٹ کی بھوکھ مٹانا ہے. یہ تو اسکی سبسے پہلی ضرورت ہے. اسکے علاوہ اس کو اسے منپسند ماحول کی ضرورت ہے جسم اسکی دماغی اور جسمانی لیاقت کو پرکھنے کا موکا حاصل ہو. ایسا نہ ہونے پر وہ صرف ایک جانور کی موافق ہو جاتا ہے. اسے مزید اور بھی لوگوں اور کدرت کے ساتھ رشتہ داری بناکر پریم اور عزت سے جینے کی ضرورت ہے. ایسے ماحول کا نہ ہونا بھی ایک کسم کے گربت ہے. پھیر گریب سماج کو کیا چاہیے، یہ کوئی اور تو نہیں بتاےگا. انھیں خود ہی بیان کرنا ہوگا.

**کیا سرکار اور یں گی او کی مدد سے گریبی مٹ سکتی ہے؟**

آج ہر کوئی سرکار یں گی او اور دیگر جمعیت خود ہی اسکا فیصلہ کرتے ہیں کہ گریب سماج کی کیا زرورتے ہیں. پھیر انکی سمج سے جو کچھ بھی دیتے ہیں بھیک کی موافک دیتے ہیں. ایسا طریق اپنانے سے گریبی بڑتی ہے کم نہیں ہوتی.

یہ بات سمجھنے کی ہے. سیاسی دل کیی ہیں. گریب سماجوں کی بات کرنے والے بھی کیی دل ہیں. لیکن ان سب گروپوں کی اقتصادی- سیاسی پیش نامہ وہی ہے جو کسی سرمایہ دار سیاسی دل کا ہوتا ہے، جو عوام کی ترقی کے لیے صرف یورپی انکشاف کے پیمانے کو ہی مناسب سمجھتا ہے. سماج کی ترقی کے لیے اور کوئی راستہ انھے نظر نہیں آتا. پچھلے ٦٦ سالوں سے اپنایا گیا یہ راستہ ٨٠ فیصد آبادی کو زیادہ سے زیادہ گربت کے اور لیے جا رہا ہے. ان حالتوں میں ان دلوں سے کچھ بھی امید کرنا محض نادانی ہوگی. ان دلوں سے امید لگاے رکھنا عقلمندی کہلاےگی جب یہ ترقی کا کوئی نیا راستہ نکالینگے.

**کیا گریب سماج کو خود کو اٹھانے کی تاکت اور قابلیت نہیں ہے ؟**

علاقائی فرق کے ہوتے ہوے بھی گریب سماج میں جو لوگ ہیں انمیں بڑا حصتہ کسان، کاریگر، آدیواسی، اور چھوٹے دُکان داروں کا ہے. ان سبھی لوگوں کے پاس سکول و کالجوں میں دی گیئ تعلیم کی تاکت نہیں ہے، دھن کی تاکت نہیں ہے، بڑے عُہدوں پر رہنے سے حاصل تاکت بھی نہیں ہے . پر انکی تاکت انکے اپنے علم میں ہے. یہ پہلے بھی لکھا تھا کہ انھے بے علم یا ان پڑھ کہنا گلت ہے. انکا علم **لوک ویدیا** (عوام میں بسا علم ) ہے. علم کا یہ خزانہ کسی دیگر کسم کے علم سے کم نہیں ہے انسے کہیں اونچا ہے. کیونکہ یہ ویدیا عوام میں بسی ہے اسلیے یہ گریب سماج کا ادھار ہے. یہ سماج لوک — ویدیا —دھرسماج ہے. اس لوک- ویدیا کی تاکت پر نہ صرف یہ اپنی گریبی کا چولا اتار سکتے ہیں، بلکہ پورے سماج میں خوشحالی بھی لا سکتے ہیں.

**لوک ویدیا کی پہچان کیا ہے ؟**

لوک ویدیا کا ذکر کبھی کسی نے نہ کیا ہوگا نہ اپنے کبھی اس کے بارے مے سنا ہوگا، کیونکہ ہم سب کی کمزوری یہ رہی ہے کہ ہم وچار کے لیے ہمیشہ ہی یورپ یا امریکا کی اور تکنے کے ادی ہو چکے ہیں. لیکن اگر آپنے پورب سے جنمے خیالات کے بارے میں سنا پڑا ہوگا تو آپ جانکاری رکھتے ہونگے کہ انہونے ہر یوگ میں اپنی تاکت پہچاننے پر زور دیا ہے. ہر یوگ میں اس تاکت کی پہچان نیے طریقہ سے کی گیئ ہے اور اسکے بل پر جنہیتھ کے لیے بدلاؤ لیے گئے ہیں. آج بھی اسے اجمایا جاسکےگا، آج بھی یہ شکیی لوک ویدیا میں ہے. لوک ویدیا کو ہم یوں سمجہ سکتے ہیں کہ یہ وہ گیان ہے جو سماج مے بسا ہے. لوک ویدیا کسی دھرم، جاتی، سمپردائی، دانِش گاہ، یا کتاب میں باندھی نہیں جا سکتی. یہ لوگوں کے جیون میں بستی ہے. وہیں پیدا ہوتی ہے اور وہیں عبرتی رہتی ہے. لوک ویدیا سماج میں رہتی ہے ، یہ سبکی ہے، یہ کسی ایک کی یا کچھ لوگوں کی نہیں ہو سکتی. یہ انسان اور اسکے سماج کے ساتھ پیدا ہوئی ہے. اس دیش میں جب تک انساں کی ہستی ہے تب تک اسکے جیون کا سہارا بنی رہیگی. لوک ویدیا کو اس ترہ بھی سمجہ سکتے ہیں. سماج کے ٨٠ فیصد لوگ جس علم کے بل پر خود جندا رہتے ہیں اور سماج کو بھی جندا رکھتے ہیں، وہ علم لوک ویدیا ہے. یہ علم سکول، کالجوں یا پھیر دانِش گاہ کے بہار پنپتا ہے اور اپنی ایک پہچان بناتا ہے. جیسی کسان اپنے علم کی تاکت پے اناج پیدا کرتا ہے. اس علم کو اسنے کسی سکول یا کالج میں نہیں پڑا، بلکہ اپنے سماج کے بجرگوں سے سیکھا ہے. اپنی ضرورت، انبھو اور عقلمندی سے اسمے سدھار کرنا اور اسے نیا بنانا اسے اتا ہے. اسی ترہ کاریگر سماج ہے. لوہا، لکڑی، مٹتی، پتھر،کانچ، پلاسٹک،کپاس، کاگز ، دھاتو ادی سے جیون کے لیے ضروری چیجوں کا اتپدھن کرنے والے ترہ ترہ کے کاریگر لوک ویدیا کے ہی دھنی ہیں.

## మహారాష్ట్రలోని సేవాగ్రాంలో 17, 18 మార్చి 2012 నాడు లోకవిద్య జనాందోళన సమావేశం

17, 18 మార్చి 2012 నాడు మహారాష్ట్రలోని సేవాగ్రాంలో లోక విద్య జనాందోళన కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రధానంగా మారుతున్న పరిస్థితులలో వెంటవెంటనే విరామంలేకుండా మనశక్తి మేరకు స్థానికంగా నూతన లోకావిద్యా ప్రపంచం ఆవిష్కరణ గూర్చి ప్రచారాన్ని ఉధృతం చేయాలని ఈ కార్యక్రమంలో కలిసివచ్చే అన్ని శక్తులతోపాటు పనిచేయాలని పిలుపివ్వడం జరిగింది. దాంతోపాటే లోకవిద్యా ఆశ్రమాలను గ్రామీణ ప్రాంతాలలో ముందుగా ఇండోర్, సింగ్రోలీ, దర్భంగా వారణాసిలలో ఏర్పాటుచేసి నూతన రాజకీయ శక్తుల పునరేకీకరణలో లోకవిద్యా జనాందోళన ప్రముఖ పాత్ర వహించాలని నిర్ణయించడం జరిగింది.

2014లో లోకవిద్యపై ఆధారపడిన చేతివృత్తుల వారిలో వెనకబడిన తరగతులని చెప్పబడే ప్రజలందరిని ఈ ఉద్యమానికి వెన్నెముకగా మలచాలని లోకవిద్య హైదరాబాద్‌శాఖ అభిప్రాయపడింది.

31 మార్చి, 1 ఏప్రిల్ 2012 నాడు దర్భంగా (బీహార్) లోకవిద్యా సమేళనం జరిగింది. ఢిల్లీ కేంద్రీకృతంగా సాగే అభివృద్ధి పథకాల వల్లనే వెనకబడిన జాతుల కష్టాలు ప్రారంభమయ్యాయని, దీనిలో భాగంగానే 1967, 1977, 1989 ఎన్నికల్లో లోకవిద్య ఆధారితులు తిరుగుబాటుతో ప్రభుత్వాలను మార్చారని అభిప్రాయపడడం జరిగింది. ఈఉద్యమాలను మరింత ముందుకు తీసుకుపోవాలంటే ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉన్న సామాజిక న్యాయం కోసం పనిచేసే వెనుకబడిన జాతుల నేతలందరూ ఉద్యమాల్లో నిలబడాల్సిన ఆవశ్యకతను గుర్తించడం జరిగింది.

మధ్యప్రదేశ్‌లోని సింగ్రోలీలో, 9, 10 ఆగస్టు 2012 నాడు 6-5-2012 నాడు మహారాష్ట్ర సాత్నాలోనూ, 24, 25 మే 2012 నాడు ఆంధ్రప్రదేశ్ చీరాలలోనూ జరిగే సభలను జయప్రదం చేయాలని పిలుపివ్వడం జరిగింది.

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

**"లోకవిద్య ప్రపంచం" చదవండి, చదివించండి,**
**చందాదారులగా చేరండి**

దీనిలోని వ్యాసాలు యథాతథంగా ఎవరైనా, ఎక్కడైనా
ప్రచురించటానికి హక్కులు అందరివి.

హిందీ. ఇంగ్లీష్, తెలుగులో టైపు చెయ్యటాన్కి, తర్జుమా చెయ్యటాన్కి దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం
నుండి ఈ వృత్తిలో నిష్ణాతుల సేవలు తగిన పారితోషికంపై స్వీకరిస్తాం.

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060. Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

BOOK - POST PRINTED MATTER
MAY 2012

To

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.**